

# బలాత్కారం

— వలివేటి నాగచంద్రావతి —

**తిరుపతి** వెళ్ళే పాసింజర్ ప్రయాణికులకు హెచ్చరికగా ఒక్క కేక వేసి బద్ధకంగా కదిలింది.

నడిచే బండితోపాటు తామూ అడుగులు వేస్తూ లేడీస్ కంపార్టుమెంటు కిటికీలోంచి మెడ సాచి లోపలికి చూశాడు రామ్మూర్తి.

తిరణాలలో గాజుల కొట్టులోలా కిక్కిరిసి ఉన్నారు లోపల ఆడవాళ్ళు. ఆ ఇరకాటంలోనే ఎట్లాగో సందు చేసి, సీట్ల మధ్యగా ట్రంకు పెట్టె వేసి దానిమీద సుఖాసీనురాలయి, ఇంకా చోటు దొరక్క గలభా పడుతున్న జనాన్ని సావకాశంగా తిలకిస్తూంది వరమ్మగారు.

ఆవిణ్ణుద్దేశించి, "బావమ్మా బండి కదిలింది. నే పక్క పెట్లోనే ఉంటా. జాగ్రత్త." అని చెప్పి, పెట్టే, మరచెంబూ, చేతి సంచీ. అన్నిట్నీ ఒక మాటు చకచక ఉన్నయ్యా అని చూసేసి, ఆ వరసనే దిక్కు తోచనట్లుగా చేతి సంచీ పట్టుకు నిలబడి పోయిన భార్యకేసికూడా ఒక సోదా చూపు విసిరి పక్క కంపార్టుమెంటు గుమ్మానికున్న కమ్మీ అందుకున్నాడు రామ్మూర్తి.

మగడు విసిరిన ఆ సోదా చూపుకే ఇంత మోహమయింది ప్రసూనకి.

చేతిలో దిగలాగుతున్న సంచి బరువు బాధగానీ, అరగంట నించీ ఏకటాకీన నించుంటం మూలాన్న తిమ్మిరెక్కి పోతున్న కాళ్ళ బాధ గానీ ఆ క్షణంలో తెలీకుండా పోయాయి ఆ వెర్రి బాగుల పిల్లకి.

సహజమే మరి! తొలి వలపు విచ్చుకుంటూ వెదజల్లుతూన్న పరిమళపు మహత్యమే అది.

ప్రసూన పదహారేళ్ళ ముగ్ధ. నూత్న వధువు. వారి వివాహ జీవితాని కింకా నెల రోజుల వయసు లేదు.

అటు వైపునో, ఇటువైపునో పసుపు బట్టలతో కొండ ఎక్కిస్తామని మొక్కు. దాని కోసమే ఈ ప్రయాణం. వారికి పెద్ద దిక్కు వరమ్మగారు.

కొత్త పెళ్ళికూతురు ప్రసూన మనసు తన జీవిత సహచరుడితో కలిసి చేసే ఈ తొలి ప్రయాణం పైన ఎన్ని ఆశలు పేర్చుతూందో. ఎన్ని కోర్కెలు మోసు లెత్తిస్తూందో!

కానీ చేతిలో దిగలాగేస్తున్న ఈ బరువు మాటేమిటి? ఈ తొడ తొక్కిడి సంగతేమిటి? ఆ మధురోహల్ని చెల్లా చెదరు చేస్తున్నయే?

రెండు స్టేషన్ల తరవాత చూట్టాని కొచ్చాడు రామ్మూర్తి.

పాపం అప్పటి దాకాకూడా నించునే ఉన్నది ప్రసూన. "కూచోవే, అమ్మడూ" అంటుంది కానీ, పెట్టెమీద అంగుళమన్నా జరగదు వరమ్మగారు. మరింకెక్కడ కూర్చునేట్టు?

పది నిమిషాల కొకమాటు కాలు మార్చుకుంటూ అవస్థ పడుతున్న ఆ అమ్మాయి నొదిలేసి, హాయిగా ట్రంకుపెట్టికి సరిపడగా కూర్చున్న వరమ్మగార్ని, "అసౌకర్యంగా లేదు కదా?" అని పరామర్శించాడు రామ్మూర్తి.

"ఆ ఏదో ఫరవాలేదులే. రైలన్నాకా మనింట్లో మల్లే కాళ్ళు జాపు కూర్చోటానికి వీలవుతుందా ఏమిటే ఏదో సరిపెట్టుకోవాలి" అన్నది వరమ్మగారు మహా సర్దుకు పోతున్న మనిషల్లే.

మళ్ళీ గుర్తు కొచ్చినట్టు, "పాపం మీ ఆవిడకే కూచోటానికి చోటు దొరికింది కాదు. అయినా ఇంకెంత సేపులే. ఆ వచ్చే స్టేషన్లో అదిగో ఆ గళ్ళచీర మనిషి దిగిపోతుందట. అక్కడ కూర్చుంటుం దిలే" అన్నది పెద్దగా జాలి పడవలసిన సంగతి కాదన్నట్టు.

ఇంకా భర్త తననికూడా పలకరిస్తాడని ఎదురు చూస్తూంది ప్రసూన. ఊహూ. ఆమె వంకన్నా చూడకుండా "అయితే సరే. మరి నేను వెళ్ళనా?" అంటున్నాడు రామ్మూర్తి పని అయిపోయినట్టు.

ప్రసూన మొహమాటం వదిలి పెట్టి "మీ భోగీలో ఖాళీ లేదా?" అన్నది మెల్లగా.

అప్పుడే ఆమె ఉనికి గమనించినట్టు వింతగా చూశాడు రామ్మూర్తి.

"ఉంది. ఏం?" అన్నాడు.

"నే నక్కడికి వస్తాం."

రామ్మూర్తి మొహం చిట్లించి, "అది మొగవాళ్ళ పెట్టె" అన్నాడు అడుగు ముందుకు వేసి.


ప్రసూన మరి మాట్లాడలేదు. అప్పటికే పుల్లాపుల్లా చూస్తూంది వరమ్మగారు. ఏదో విడ్డూరం జరిగిపోతున్నట్టు.

రోజు లెంత మారినా తనతరం గాడినుంచి ఒక్కడుగు ముందుకు వేసి ఆలోచించ దావిడ.

ముగ్గురు నలుగురు పిల్లలు పుట్టేదాకా పగలు మగడి ఎదుట పడేవాళ్ళు కాదు తాము. ఇప్పటికీ తలుపు వెనుక నించీ మగవాళ్ళకి జవాబు చెప్పటం అలవాటు తమ ఇంట్లో. అట్లాంటిది ఇంకా పెళ్ళయి పదహా రోజుల పండగన్నా వెళ్ళిందో, లేదో ఈ పిల్ల కెంత చొరవా!

"లేరా ఈ కాలం పిల్లలూ?" అనుకుంటూ విసుక్కుంటూం దావిడ.

ఆవిడ అయిష్టాన్ని గ్రహించుకున్నాక తరవాతి స్టేషన్లో రామ్మూర్తి వచ్చినప్పుడు తల వంచుకునే



ఉండిపోయింది ప్రసూన.

కానీ అతను ఉన్న కంపార్ట్మెంటులోకి వెళ్ళాలనే కోర్కె మాత్రం అణగారలేదు ఆ అమ్మాయికి.

మాట్లాడుకోకపోతే మానె కనీసం ఒక దగ్గర కూర్చుంటేన్నా చాలని మనసు వువ్విళ్ళూరుతూంటే మళ్ళీసారి రామ్మూర్తి వచ్చినప్పుడు, వరమ్మగారు కునుకుతున్న తరుణం చూసి, "మేమూ మీ దగ్గరికే వచ్చేస్తాం" అన్నది సిగ్గు సిగ్గుగా.

"మగవాళ్ళున్నారని చెప్పానా" అన్నాడు రామ్మూర్తి అసహనంగా.

"అయితే ఏం? " ప్రసూన అమాయకంగా అడిగింది.

"తెలియనట్టడుగుతావేం? వాళ్ళ మధ్య నలగా లని సరదాగా ఉందా ఏం?"

"ఛీ ఛీ" ప్రసూన మొహం జేవురించింది.

రామ్మూర్తి మొరటుగా వేసిన అభాండానికి కుంచించుకు పోయింది గాన.

కొత్తగా రెక్క లొచ్చిన పక్షిలా ఉత్సాహంగా గగనవిహారం చేస్తున్న మనసును నేలబారుకు దింపుతూ సూటిగా తాకిన తొలి దెబ్బ అది.

అడంగుకి చేరేదాకా ప్రసూన మరి మామూలు మనిషి కాలేకపోయింది.

రామ్మూర్తి అన్న మాట గుర్తు కొచ్చినప్పుడల్లా "ఛీఛీ ఛీ ఛీ" అనుకునేది ఎన్ని సార్లో.

కొండ పైకి సాగిన ప్రయాణం అప్పటి వరకూ రైల్లో పడిన శరీర శ్రమని పోగొట్టటమే కాక మానసికంగాకూడా సేద దీర్చింది.

బస్సు మలుపులు తిరుగుతున్నప్పుడు ఆ లోయ ల్లోకి ఉరకాలనీ, ఆ చెట్ల నడుమన దాగుడుమూత లాడాలనీ, చిగురుటాకులూ రంగుల పువ్వులూ కలేసి మాలలు కట్టి మెళ్ళో వేసుకోవాలనీ పిచ్చి కోరికలు పుట్టాయి ప్రసూనకి.

అలాటి వేళల్లో పక్కన జత ఉంటే ఆ ఆనందం మరింత మధుర మవదూ! ప్రసూన వోరగా రామ్మూర్తి వైపు చూసింది.

ఆతగాడు కళ్ళకి చెయ్యడ్డంచి నిద్రావస్థలో ఉన్నాడు.

నీరు కారిపోయింది ప్రసూన.

కొండమీది వాతావరణం ఇంకా అహ్లాదంగా ఉంది. కానీ అది తనివితీరా ఆస్వాదించే సావకాశమే లేదు.

బస్సు దిగంగానే సంచీ మోత తప్పలేదు. అందులోనూ సిమెంటు బస్తా అంత ఉందది. వంట క్కావలసిన గిన్నెలు దొన్నెలు, బియ్యం పప్పులు ఉప్పులు కాణ్ణించి పక్కలకి పర్చుకునే జంబఖానాల వరకూ అన్నీ దాన్లోనే ఉండి మణుగు రాళ్ళు నింపినట్టు కుంగ దీస్తున్నయ్ మనిషిని. ఆకారం డాంబికమే కానీ, ట్రంకు పెట్టెలో తలా రెండు జతల బట్టలు తప్ప మరేం లేవు. అది రామ్మూర్తి పట్టుకున్నాడు. వరమ్మగారి వంతు మరచెంబూ, స్టౌ ఉన్న సంచీ .

ఈ బరువులు మోసుకుంటూ గుట్టలూ మిట్టలూ దాటుకుని దేవస్థానం వారిచ్చిన సత్రం గది వెదుక్కునే సరికి ప్రాణం కడబట్టింది.


సంచి దించి చేతులు చూసుకుంది ప్రసూన. అలవాటులేని పనేమో లేతమలపాకుల్లాంటి అరచేతులు కుంకుమ అద్దినట్టు ఎర్రగా కంది చర్మం పొట్టు రేగిపోయాయి.

పట్టు పంచె వెతుక్కుంటూ ప్రసూన చేతులు వూదుకోడంచూసింది వరమ్మగారు. "ఒసి నీఅబ్బరమా ఈ మాత్రానికే?" అన్నది ఆశ్చర్యంగా చూశా వ్రటా అన్నట్టు రామూర్తి కేసి చూసి.

"మనం మాత్రం మొయ్యలా?" అన్నాడు రామ్మూర్తి.

తనే మన్నదనీ, తనే కష్టపడ్డావనీ, వాళ్ళని సానుభూతి చూపించమనీ, జాలి పడమనీ అడిగిందా ఏమన్నానా? ప్రసూనకి అభిమానంతో కళ్ళ నీళ్ళు తిరిగాయి.

వరమ్మగారు మడి బట్ట కట్టి వంట కుపక్రమిం చింది.




ప్రసూనని స్నానం చేసి ఆవిడకి సాయం చెయ్యమన్నాడు రామ్మూర్తి.

ఆవిడ "ఫరవాలేదు లేవయ్యా. ఏదో నేనే తంటాలు పడతాలే" అంటూన్నా వినిపించుకో లేదు.

అది అతని దృష్టికి పెద్దవారి పట్ల గౌరవ ప్రవర్తనలు ప్రకటించడమో, లేకపోతే భార్యమీద అధికారం చెలాయించే హక్కునిరూపించ కునే తాపత్రయమో తెలీదు కానీ ప్రసూన పాలిటి కా ఆజ్ఞ చేయని నేరానికి వేసిన శిక్ష అయింది.

కార్తీకం వెళ్ళి మార్గశిరం జొరబడిన తొలి రోజు. పగటి పూటకూడా చలి గడగడ లాడిస్తూంది. కొండ మీదవటం నించి మరీని.

పసితనం వదిలీ వదలని ప్రాయం, స్వత సిద్ధమైన సౌమ్య స్వభావం, భర్త కెదురాడకూడదనే నరాన జీర్ణించుకు పోయిన దాస్య భావం. ప్రసూన మారు మాటాడకుండా మంచు లాంటి నీళ్ళు తలమీద గుమ్మరించుకుని, తడి బట్టలతో గజగజ వణుకుతూనే వరమ్మగార్కి సాయం చేసింది.

భోజనాలయ్యాయి. రామ్మూర్తీ వరమ్మ గారూ జంబుఖానాలు పరిచి నిద్రకు పడ్డారు.

ప్రసూనకి పగటి నిద్ర అలవాటు లేదు. కాలక్షేపాని కుంటుందని పుస్తక మొకటి సంచిలో వేస్తే, "ఇదో జరువా" అంటూ అత్తావారింట్లో వాళ్ళెవరో తీసేశారు.

కిటికీ ఎక్కి బయటకు చూస్తూ కూర్చుంది ప్రసూన.

దూరంగా గంభీరాకృతుల్లో ఠీవిగా కనిపించే కొండలు, నీలాకాశంలో రెక్కలు చాచి గిరికీల కొడుతున్న పక్షులు. అక్కడక్కడా గుట్టలమీద బొమ్మరిళ్ళలా కనిపిస్తున్న చక్కటి కాటేజీలు, చుక్కల మధ్య వెలిగే చంద్రుళ్ళా వాటి నడుమన రాజప్రాసాదాల్లాంటి భవనాలు, మరకతాలు పొదిగి నట్లు నీరెండలో మిల మిల మెరిసి పోతున్న పచ్చిక బయళ్ళు ప్రసూన మైమరిచి పోయింది.

సాయంత్రం అయింది.

"అలా తిరిగి వద్దాం. వస్తారేమిటి?" అన్నాడు రామ్మూర్తి బట్టలు వేసుకుని సిద్ధమవుతూ.

"అబ్బే లాభంలేదురా అబ్బీ నాకాళ్ళు పట్టేశాయ్" అన్నది వరమ్మగారు కాళ్ళు జాపుకుంటూ.

మరోమనిషిలేనట్టే వెళ్ళబోయాడు రామ్మూర్తి.

"నేను వస్తాను." ప్రసూన అంది జంకుతో లోగొంతుక పడి.

చిత్రంగా చూస్తున్న రామ్మూర్తి తీరు చూస్తే ఆ అమ్మాయి నోటివెంట మాట రావటమే అతనికి విడ్డూరంగానో అపరాధంగానో ఉందేమో ననిపిస్తూంది.

ఏ కళ నున్నదో వరమ్మగారు "పోనీ లేవయ్యా, తోచక కొట్టుకుంటూంది. దీన్ని తీసుకుపో" అని సి ఫార్సు చేసింది.

వెళ్ళేవాడు ఆగి "సరే రా" అన్నాడు రామ్మూర్తి దయ దలిచినట్టు.

ప్రసూన చీర మార్చుకుని కలల్లో తేలుకుంటూ బయటకు వచ్చే వేళకి రామ్మూర్తి రోడ్డు మీద నిలుచుని ఉన్నాడు.

ప్రసూనని చూసి నడక సాగించాడు. ఇద్దరి మధ్యనా ఇరవయి గజాల దూరం. ఆ దూరం దూరం తిరిగి గదికి చేరుకునే దాకా అట్లాగే ఉంది.

అత నేదో కొంపలు ముంచుకు పోతున్నట్టు గబ గబ నడుస్తూ ముందుకు పోతూండటం మూలాన పడుతూ లేస్తూ అతనెక్కడ కనుమరుగయి పోతాడో నని హడలుకుంటూ వెంట బట్టమే సరిపోయింది ప్రసూనకి.

అతను తన పక్కనే కబుర్లు చెబుతూ నడుస్తాడని, తన పాదాల మీద నర్తిస్తున్న కుచ్చిళ్ళ అందాన్ని మెచ్చుకుంటాడనీ, ఆ చీరకే సింగారం తెస్తున్న తన సౌందర్యాన్ని పొగుడుతాడనీ, ఎవరూ లేని చోట తన గోరింటాకు చేతి నతడు ముద్దాడుతాడనీ, అల్లరిగా అతను చిలిపి మాటలు రువ్వితే తాను గారాలు పోవాలనీ ఎన్నో, ఎన్నెన్నో, ఈ కలలన్నీ గాలికి కొట్టుకు పోయాయి.

తను చూడాలని ఎంతగానో మనసు పడ్డ రోజ గార్డెన్ పక్కంటకే నడిచి పోయామని గానీ, జట్లు జట్లుగా జతలు జతలుగా మెట్లు దిగి కుతూహలంగా జనం చూస్తున్న స్థలం చంద్రగిరి దృశ్యమని కానీ ప్రసూనకి ఏ మాత్రం తెలీలేదు.

అటూ ఇటూ అన్నీ తల తిప్పి చూస్తే ఒట్టు! ఏక పరుగు పందెమే.

ఫలితం అనుభూతుల నందిస్తుందని ఆశించిన వాహ్యాళి ఆయాసాన్ని మిగిల్చింది.

• • • •

రాత్రిఫలహారాలు పెందరాళ్ళే ముగించారు. వరండాలో కూర్చుంటే దేదీప్యమానంగా వెలిగి పోతూ స్వామి వారి నామాలు పిలుస్తున్నట్టే కనిపించాయి.

వరమ్మగారు నోపిక చేసుకుని "వెడదాం పద" మంది.

ఇప్పుడూ షరా మామూలే. అతను ముందూ, వీళ్ళు వెనక. లేకపోతే కాస్త మినహాయింపు ఒక ఫర్లాంగు దూరం ముందు వెళ్ళిపోయి వీళ్ళ కోసం ఆగుతాడు. వీళ్ళు కలవంగానే మళ్ళీ టకటక వెళ్ళిపోతాడు.

రామ్మూర్తి అలా ఆగినప్పుడు ఊరుకోలేక ధైర్యం చేసి 'ఎందుకంత తొందర? మాతో పాటే నడవకూడదూ?" అన్నది ప్రసూన ఆయాసపడుతూ.

"దాని పక్కంటేట నడవరా. మనసుగా ఉంది గావునా!" మేలమాడింది వరమ్మగారు.

రామ్మూర్తి మొహం చిట్లించాడు. "వూ వూ పక్కంటే ఏం ఖర్మ సిగ్గు బిడియాలు ఒదిలేస్తే చెట్టా పట్టాలు వేసుకే నడవచ్చును" అన్నాడు వెటకారంగా.

'ఆ హ హ" వరమ్మగారు నవ్వింది, అదేదో గొప్ప జోకయినట్టు.

కట్టుకున్న ఇల్లాలి పక్కంటే నడవటంకూడా దోషమేనా? ప్రసూన లోలోపలే బిత్తరపోతూంది.

రామ్మూర్తి మళ్ళీ ఎవరో తరుముతున్నట్టే నడకందుకున్నాడు.

వరమ్మగారు వాళ్ళ ఇంటి మగవాళ్ళ ప్రయోజకత్వం గురించి మురిసి పోతూ చెప్పుకొస్తూంది.

"వీళ్ళ తాతగారుకూడా ఇంతేనే,అమ్మడూ! ఎంత పౌరుషమనీ! ఆయన పోయేదాకా అలాకాదు ఇలాగండీ అని చెప్పగలిగేదాన్ననుకున్నావా? వూహూ. ఇంటి యజమాని ఇంట్లో ఉండగా ఆడది ఇంట్లో ఉన్నా లేనట్టే ఉండాలే అనేవారు. అట్లాగే బిరలో ఉంచేవారు."

మాట్లాడకుండా వింటూంది ప్రసూన.

తన మొగుడిగారి ప్రతాపగాథకి ఈ పిల్ల ముగ్ధురాలయి పోయి మాట్లాడ లేకపోతూందనుకుని వరమ్మగారి ఉత్సాహం రెట్టింపయింది.

"ఒకసా రేమయిందనుకున్నావు? మా వారు అదే మీ మావగారు వాళ్ళ తండ్రి గారి దగ్గర మా ఆవిడేమన్నదంటే అని ఏదో చెప్పబోయాడు.. ఈయన విన్నా రనుకున్నావా? 'ఒరేయ్ మన కాలి కింద పడుండే ఆడదాని మాటకి విలువిచ్చే నాపసన్నాసివి. నీతో మాట్లాడ్డానికే నాకు చిన్నతనంగా

ఉందిరా. ముందు నా ఎదురు గుండా వెళ్ళిపో'' అనేశారంతే.

ఆ నాటి నుంచీ ఈ నాటి వరకూ పడగ్గది దాటి పెళ్ళాన్ని తలవడు తెలుసా'' అంటూంది ఘనంగా.

అది పౌరుషం కాదు మగవాడి నన్న దురహంకారమని ఆవిడ కెప్పుడు అర్థమవుతుందో?

చెట్టు ఒక జాతి దయితే కాయ ఇంకో జాతిని కాస్తుందా? వినే కొద్దీ మతి పోతూంది ప్రసూనకి.

ఇంకా ఎన్ని వర్ణించేదో కానీ, దేవుడు రక్షించి చేరవలిసిన చోటికి వచ్చేశారు.

నామాల చుట్టూ ప్రదక్షిణలూ, సాష్టాంగ నమస్కారాలూ చేయటంలో మునిగి పోయారు వరమ్మగారూ, రమ్మూర్తీను మరో ధ్యాస లేకుండా.

వారి ననుసరించే ఉన్నది ప్రసూన. కానయితే మనసూ, చూపే దేవుడి పాదాల మీద నిలవకుండా చంచలంగా ఎక్కడెక్కడికో, వేటవేటిమీదకో పరుగులు తీస్తున్నాయ్.

''తప్పు పాపం'' అంటూ బుద్ధి ఎంత బుద్ధి చెబుతున్నా వింటేనా?

దీపాల కాంతిలో పట్టపగలైన పరిసరాల్ని పరికించమంటున్నాయ్. వెన్నెల వెలుగులో ప్రకృతి రువ్వే మందహాసాలు తిలకించమంటున్నాయ్. ఒకదానితో ఒకటి పోటీ పడుతున్న విరికన్నెల తారుణ్యాన్ని గమనించమంటున్నాయ్.

అంతేనా పచ్చిక తివాచీల మీద ఒరిగి కబుర్లాడే జంటల్నీ, చీకటి మాటున పొదరిళ్ళలో కరిగిపోతున్న జోడీల్నీ చూట్టం మరిచి పోకుసుమా అని రహస్యాలు చెబుతున్నయ్.

కళ్ళు మూస్తూ తెరుస్తూ ప్రసూన ఉక్కిరిబిక్కిరయింది అంత సేపూ.

తిరుగు మొహం పట్టే ముందు ఆహారానికో ఆయాసం తీర్చుకోవటానికో అయిదు నిమిషాలు ఒక చోట కూర్చున్నారు.

అక్కణ్ణించి చూస్తే బుల్లి బుల్లి కాటేజీలు కిటికీలకి కర్టెలన్నా చుట్టూ తోటా అందంగ దృష్టి నాకట్టుకుంటూ కనిపిస్తున్నాయ్.

ఒక దాని ముందర ఇద్దరు పిల్లలు దొంగాటాడుతున్నారు. స్వెట్టర్లూ టోపీలూ వేసుకుని బొద్దుగా ముద్దుగా ఉన్నారు వాళ్ళు. వాళ్ళ తల్లీ తండ్రీ కాబోలు కేరింతలు కొడుతూ వాళ్ళతో పాటిగా పరుగులు పెడుతున్నారు.


ఇంకో కాటేజీ వరండాలో ఆనుకొంత దగ్గరగా కుర్చీలు వేసుక్కూర్చుని, అదీ చాలనట్టు ఒకరి మీదొకరు వాలి గుస గుస లాడుకుంటున్నారో యువజంట.

''ఆ కాటేజీలు ఎంచక్కా ముద్దొస్తున్నాయ్ కదూ?'' తను నోరు మెదపటం ఎంతని గ్రహించుకుంటే అంత మేలని అనుకుంటూనే ఎప్పటికప్పుడు అలవాటుగా పొరపాటు చేసేస్తుంటుంది ప్రసూన.

ఒక సారటు వైపు చూసి తల పంకించి పూరుకున్నాడు రామ్మూర్తి.

''మనంకూడా అలాంటిది తీసుకుంటే బాగుండేది'' మరో మాట జారింది ప్రసూన.

''ఉహూ. కోరికలన్నీ అతివేనే. వాటికి ఎంత పొయ్యాలో తెలుసునా? ఎక్కణ్ణించి తెద్దాం?'' గుంజాడు రామ్మూర్తి.



ఫోటో: ఎ. లత

బయులుదేరేటప్పుడు తన తండ్రి ఖర్చు కుంచమని వెయ్యి రూపాయలు అల్లుడి చేతిలో పెట్టాడు ఏమయ్యాయవి? ఆ మాట పైకనే సాహసమే!

''అయినా ఒక పువ్వడ గాలీ కాయడ గాలి గానీ ఇవేం కోరికలే ఉమ్మడూ! అట్టాంటి దుబరా ఖర్చులు పెడితే రేపు అడుక్కు తినాలి.'' బుద్ధులు చెప్పే ధోరణిలో చివాట్లేసింది వరమ్మగారు.

లేనివారుకూడా ఉన్నంతలో సుఖ పడాలనీ ఆనందించాలనీ చూస్తారే? కలిగిన వాళ్ళయి ఉండీ వీళ్ళేమిటో ఇలా. పాసింజరు బండి ప్రయాణం. సామాను మోసేందుకు కూలీని పెట్టటందుక్కూడా మొహం చూసుకునే ఈ కక్కుర్తి.

ఈ బేరీజులతో మననం చేసుకోదగిన మధురానుభూతుల్ని ప్రోవు చేసుకుని మనసున నిక్షిప్తం చేసుకోవాల్సిన వయసు, అన్వేషించి మరీ సుఖాలనాస్వాదించి ఆనందించాల్సిన సమయం. అన్నీ వృధా అయిపోవల్సినా?''

కలలు కరిగి అంత కంతకూ మనసు ఉదాసీనమవుతూంటే నిస్తేజంగా ఎటో చూస్తూండిపోయింది ప్రసూన.

● ● ● ●

''ఏయ్ నిన్నే లేలే.'' అన్న కేకలకి మెలుకువ వచ్చింది ప్రసూనకి.

చేతిమీద ఉప్పు టప్పున దెబ్బ పడకపోతే తనని కాదనుకునేదే.

కళ్ళు తెరిచింది. రామ్మూర్తి తువ్వాలు మడిచి కొడుతున్నాడు. లేపటం సొగసు అది.

మూసిన రెప్పల పైన మెత్తని అధరాలు వత్తడూ. చెవుల దగ్గిర భూపాల రాగంలో సన్నగా మోగే వేణునాదం. కంఠం మీద గిలిగింతలు పెట్టే కరాంగుళులు ఇలాంటి మేలుకొలుపు లన్నీ కథల్లోని నాయకులకే పరిమితం కాబోలు.

''దబ్బున లెవ్వే, అమ్మడూ! లేచి మొహనుదీ కడుగు. మళ్ళీ ఆలస్య మయిపోతూంది గుళ్ళోకెళ్ళేటప్పటికి.'' వరమ్మగారు హడావిడి పడుతూంది.

నిట్టూర్చి లేచింది ప్రసూన. కాళ్ళు నేల కానితే షాక్ తగిలినట్టు జిల్లుమంటున్నాయి. కిటికీ తలుపులు తెరిచింది. శీతగాలి రివ్వుమంటూ మొహాన్ని తాకింది. బయట చీకట్లు ఏ మాత్రం విడలేదు.

''టైమెంతయిందో?'' పెట్టెలో రామ్మూర్తి వాచీ తీసి చూసింది ప్రసూన.

మూడున్నరయింది.

''తెములు తెములు'' వరమ్మగారి తొందర.

కాలకృత్యాలు తీర్చుకుని బట్టలు చేతి సంచీలో పెట్టుకుని స్నానాలు పుష్కరిణిలో చెయ్యాలట బయులుదేరారు.

అడుగవతలున్న మనిషి కనిపించని దట్టమైన పొగమంచు.

ఒంటరిగా దొరికిన శత్రువు మీద పగ తీర్చుకుంటున్నట్టు ఎడా పెడా మోదుతున్న చలిగాలి.

హిమాలయాలలోని మంచు అప్పుడే కరిగించి పోసినట్టున్న పుష్కరిణి నీళ్ళలో సచేల స్నానం.

పసుపు బట్టలతో 'క్యూ' కొండచిలువ కడుపులో ప్రవేశం. తాబేలు నడకతో ఎలాగో దాన్నధిగమించటం, ఇన్ని గండాలు దాటి వెళ్ళినా తృప్తి తీరకుండానే అయిందనిపించిన దైవదర్శనం అన్నీ ఒక దాని తరవాతొకటి యాంత్రికంగా పూర్తయ్యాయి.

అవును. అక్షరాలా యాంత్రికమే. సరసత లోపించిన మనుషులతో ఏ పనయినా యాంత్రికంగానే ఉంటుంది.

ఒక సరదా మాట లేదు, ఒక నవ్వు మొహం లేదు. సెంట్రల్ జైలుకి ఖైదీల్ని తీసుకు పోతున్న కానిస్టేబుల్‌లా మొహంబిగదీసుకునే ఉంటాడెందుకో రామ్మూర్తి.

దాని కోగొప్ప వ్యాఖ్యానం చెబుతుంది వరమ్మగారు.

మగవాడన్న వాడు అలా గంభీరంగా ఉంటమే హుందాతనానికి చిహ్నమాట.

హుందాతనంపోషించే మాట అలాఉంచి బుర్రలో ఏమీ లేకపోతే తప్ప అసలలా ఎప్పుడూ నోరు బిడాయించి ఉంటం ఎలా సాధ్యం?

పోనీ మాట్లాడడు సరే కాస్త నిదానంగా అదీ ఇదీ అన్నీ చూడనివ్వడే. గొడ్లని తోలినట్లు పదపద అంటూ అదిలించటం, కోపం, విసుగు, చిరాకు, చీదరించుకోవటం. ఇదీ వరస.

ఇవి వేటికి చిహ్నలో వరమ్మగారు చెప్పలేదు మరి.

ఇక వరమ్మగారి సంగతి మరీ విపరీతం.

అంతమంది జనంలో ప్రసూనని ఘోషాలో ఉంచాలని చూస్తాం దావిడ.

అటు చూడనివ్వదు. ఇటు మెసలనివ్వదు. ''అదిగో వాడు తాకేట్టున్నాడు ఇటు జరుగు'' అంటుంది. ఇదిగో వీడు చూస్తున్నాడు. అటు తిరుగు''

అంటుంది.

అంత రద్దీలో ఏ మగవాడి చెయ్యో తగలటం అసంభవమేమీ కాదు కదా—అంత మాత్రానికే ఆ అమ్మాయి పాతివ్రత్యమేదో భంగ పడ్డట్టు, "నే చెబుతూనే ఉన్నానా ఆ వెధవ రాసుకు పోయ్యేలా ఉన్నడే ఘంటా రావే అని" అని తప్పంతా ఆ పిల్ల మీదేసి రుసరుస లాట్టం, రామ్మూర్తి కొరకొర లాడుతూ మింగేసేలా ఎర్రగా చూడ్డం

నిజంగా నరకమయి పోయింది ప్రసూనకి.

• • • •

అఖిలాండం దగ్గర కొబ్బరికాయ కొట్టి నమస్కారం చేసి ఇవతలికి వచ్చే వేళకి పది గంట లయింది.

"భోజనానికి తొందరేముంది పాపనాశానికి వెళ్ళి వద్దాం" అన్నాడు రామ్మూర్తి.

"అలాగే" అంది వరమ్మగారు.

వెళ్ళాలనే ఇచ్ఛ గానీ, ఉత్సాహం గానీ ఏ కొద్దిగా కూడా లేవు ప్రసూనకి.

కానీ తన అభిప్రాయానికి తావెక్కడుంది?

వారి వెనకాల మరబొమ్మలా బస్సెక్కింది. వాళ్ళు దిగమన్న చోట దిగింది. వాళ్ళు తడవ మన్న చోట తడిచింది. వాళ్ళు మొక్క మన్న చోట మొక్కింది. అంతే.

వచ్చేటప్పుడు బస్సు దొరకలేదు. వాళ్ళు ముందే రెండు బస్సులు నిండి వెళ్ళి పోయాయి. ఇంకా మరో రెండు బస్సుల జనం మిగిలి ఉన్నారు.

శీతాకాలం ఎండయినా నెత్తి మాడుస్తూంది.

గుడిలో తిన్న ప్రసాదం అరిగి ఆకలి రాజు కుంటూంది.

ఇంకా సత్రవుకి వెళ్ళాలి. వంట చెయ్యాలి. ఆ ఆలస్యం తలుచుకుంటేనే నీరసమొస్తూంది.

పైగా సాయంత్రానికి కొండ దిగిపోవాలని సంకల్పం. ఆ బస్సు క్యూలో, ఇంకెంత జాప్య మవుతుందో తెలీదు.

ఇప్పటి కిక్కడే ఒంటి గంట కావస్తూంది.

ఇది ఇలా ఉండగా ఇప్పుడు ఇక్కడకు రాబోతున్న బస్సు త్రోవలో చెడిందని వార్త!

ఇంకో బస్సు ఎప్పుడు వస్తుందో ఏమో?

ఉన్న నాలుగయిదు టాక్సీలూ కొంతమంది కుదుర్చుకుంటున్నారు. వరమ్మగారి అంచనాలో వాళ్ళు ఉన్న మారాజులు. ఇంకొంతమంది కాలు జాడించే ప్రయత్నంలో ఉన్నారు.


వాళ్ళతో వీళ్ళూ కలిశారు.

సత్రానికి వచ్చి పడేటప్పటికిచచ్చి చెడి శాయం గల విన్నపాలయ్యాయి.

రావటం రావటం జంబుఖానాకి అడ్డం పడ్డాడు రామ్మూర్తి.

వరమ్మగారు ఉస్సు రుస్సు రంటూ చూసి, "బామ్మా నువ్వూ కాస్త నడుం వాల్చవే. అలిసి పోయావూ. ఈ పూటకి ఏ ఉప్పుడు పిండో అది కల బెట్టేస్తుందిలే" అని ఆప్యాయం ఒలక బోశాడు.

'పాపం పెద్దావిడ' అనుకున్నదే కానీ, వాళ్ళకంటే ఎక్కువగానే అలిసిపోయింది ప్రసూన. ఈ తల స్నానాలూ, తిరుగుడూ అలవాటు లేని అవుపోసనాలు.



కూడూ వద్దు కుమ్మరాం వద్దు కాళ్ళు ముడుచుకు పడుకోవాలనే ఉన్నది కానీ మరివాళ్ళిద్దరిమాటేమిటి?

మళ్ళీ తల స్నానం తప్పలేదు. తడిబట్ట ఒంటిని కరుస్తూంటే చేతియ్యా, చేతకాని వంటలో ఏదో తడబాటు. వరమ్మగారు నోటితోనే దిద్దుబాట్లు చేస్తూంది.

"ఆ మాత్రం చేతకాదూ" రామ్మూర్తి నిరసన. అక్కడికి పుట్టంగానే అన్నీ నేర్చి ఉండాలన్నట్టు. "పెంపకం!" అంటూ పరోక్షంగా పెద్దల మీద కూడా విసుర్లు.

వీటితో ఇంకా నీరస మొచ్చేసింది ప్రసూనకి. విస్తరి ముందు కూర్చుంటే ఒక్క ముద్ద నోటికి పోలేదు.

మనశ్శరీరాలు రెండూ విశ్రాంతి కోరుకున్నాయి గాఢంగా.

కానీ మేను వాల్చే తీరుబాటేది? అప్పుడే—"సర్దండి సర్దండి" అంటున్నాడు రామ్మూర్తి.

మూటా ముల్లే కట్టేశారు. సంచిలో సామానుకి తడిబట్టలు తోడయ్యాయి ఈ సారి.

వాళ్ళ నెవర్నన్నా పట్టుకొమ్మందామంటే అదేమి నేరమవుతుందో.

దాన్ని ఈడ్చుకుంటూ, వెనక బడుతూ, వాళ్ళ విసుక్కి గురి అవుతూ ఎట్లా గయితేనేమి బస్టాండుకి చేరేశాననిపించింది ప్రసూన.

వాళ్ళ నో పక్కగా నిలబడమని రామ్మూర్తి టికెట్లకి వెళ్ళాడు.

నిలబడలేనంత నిస్త్రాణగా ఉంది ప్రసూనకి.

అదో పర్మినెంట్ సీటులా ముందస్తుగానే ట్రంకుపెట్టె వాల్చుకు కూర్చుని ఏదో సోది పెట్టింది వరమ్మగారు.

ఒక్క ముక్క చెవిలో దూరటం లేదు ప్రసూనకి.

అరగంట తరవాత ఆదరా బాదరా వచ్చాడు రామ్మూర్తి.

వస్తూ వస్తూనే "తొరగా రండి. బస్సు రెడీగా ఉంది" అంచెప్పి, అంటూ అంటూనే వెనక్కి తిరిగి, "నే ముందు ఎక్కి మీకు సీటు ఉంచుతా" అంటూ పరిగెట్టాడు.

"పెట్టె, పెట్టె" అంటూనే ఉంది వరమ్మ గారు. అతను వినిపించుకో లేదు.

ఆత్రం కొద్దీ ఒక చేత్తో సంచీ, ఒక చేత్తో పెట్టె పట్టుకుని తొందర తొందరగా రెండడుగులు వేసిందేమో కలుక్కుమన్నది మోకాలు.

ప్రసూన "అబ్బా" అనటమేమిటి చేతిలో సంచి పట్టు జారి కుడికాలు మీద పడ్డమేమిటి ఒక్క మాటే జరిగాయి.

ప్రసూన కూలబడి పోయింది.

"అయ్యో అయ్యో" అంటూంది వరమ్మగారు.

పక్కన వెడుతున్న వాళ్ళెవరో కాలిమీద పడ్డ సంచి పక్కకి పెట్టారు. రెక్క పట్టి లేవదీశారు.

మోకాలి బెణుకు బాధ అటుంచి పాదం మండి పోతూంది.

"అమ్మో పాదం మీద రక్తం వరదలవుతూందే. ఏమయిందే." వరమ్మగారు గాభరా కొద్దీ కేక వేస్తూంది.

సంచి అడుగు నుంచి పొడుచు కొచ్చి సమాధానం చెప్పింది కూరలు కోసుకునే చాకు.

ఎవరో ఇంత మన్ను పోశారు పాదంమీద— "రక్తం కడుతుంది" అంటూ.

"కాస్త నిమ్మదిగా నడవకూడ దటమ్మా ఈ బస్సు కాకపోతే ఇంకొకటి" అంటున్నారు.

ఇంతలో వచ్చాడు రామ్మూర్తి.

"మీకు బుద్ధుందా? ఏం చేస్తున్నా రిక్కడ? ఆవతల బస్సు కాస్తా వెళ్ళిపోయింది." మండి పడుతున్నాడతను.

"ఇది సంచేసుకు పడిందిరా" వరమ్మగారి వివరణ.

"ఏడవక పోయింది. దేభ్యం మోహమేసుకుని గట్టిగా పట్టుకు వడవ్వద్దూ? ఏవన్నా కింద పడ్డా యేమో చూశారా?"

పడిందంటే 'దెబ్బ తగిలిందా?' అనన్నా అడక్కుండా "ఇక పదండి. తరవాత బస్సుకూడా మిస్సయ్యేట్టున్నాం" అంటున్న అతగాణ్ణి విరక్తిగా చూసింది ప్రసూన.

దిగువకి వచ్చేశారు.

దేవస్థానం సత్రం కాక లాడ్జిలో రెండు గదులు తీసుకున్నాడు రామ్మూర్తి.

ఎందుకో?

ఆ రాత్రి అతను ఒంటిమీద చెయ్యేస్తుంటే జుగుప్సతో ఒళ్ళు గరిపొడిచింది ప్రసూనకి.

హృదయానికి సన్నిహితం కావటానికి ఏ ప్రయత్నమూ చేయని భర్త—శరీరానికి మటుకు చేరువ కావటానికి ఆత్రం చూపిస్తూంటే భరించ లేక పోతూంది.

కాంక్ష, లాలస తప్ప మమత, అనురాగం లేని ఆ స్పర్శకి శరీరం ఎదురు తిరుగుతూంది.

ఆమె విముఖత తెలుస్తూంటే "ఏమిటా బెట్టు? మరెందు కనుకున్నావ్ సెపరేటుగా గది తీసుకున్నదీ?" అంటున్నాడు రామ్మూర్తి.

కక్కుర్తిగా, ఆబగా బలవంతంగా ఆక్రమిస్తున్న అతన్ని చూస్తూంటే ఎవరో పరాయివాడు రాక్షసంగా, క్రూరంగా, కాముకంగా తన్ని చెడుపు తున్నట్టే తోచింది ప్రసూనకి.

భర్త అన్న స్పృహ నశించింది ఆ క్షణంలో.

మరుక్షణం అతన్నించి గింజుకుంటూ—"రక్షించండి రక్షించండి" అని అరుస్తున్నా ననుకుంది కానీ, అరవలేదు. వెర్రిగా చూస్తూండి పోయింది.

●